సాక్షి
ప్రకాశం
సోమవారం | 3 | జూలై | 2023



అదిగో నవలోకం..
జగనన్న కాలనీల్లో విద్యుత్ సౌకర్యం కల్పిస్తున్నారు. పశ్చిమ ప్రకాశంలో 220 లేఔట్లు ఉండగా 141 లేఔట్లలో విద్యుదీకరణ పూర్తయింది.
- 8లో..



గుప్తనిధుల కోసం తవ్వకాలు
గుప్తనిధుల కోసం పురాతన ఆలయంలో తవ్వకాలు చేస్తుండగా ఏడుగురిని గ్రామస్తులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు.
- 8లో..

గరిష్టం/కనిష్టం
37 /29

వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం ఉంది. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

చీమకుర్తి రోటరీ క్లబ్‌కు 18 అవార్డులు



అవార్డులతో రోటరీక్లబ్ సభ్యులు

చీమకుర్తి: 2022–23 ఆర్థిక సంవత్సరంలో చీమకుర్తి రోటరీక్లబ్ చేపట్టిన సేవా కార్యక్రమాలకు 18 అవార్డులను వచ్చినట్లు క్లబ్ నిర్వాహకులు ఆదివారం తెలిపారు. శనివారం గుంటూరులో రోటరీక్లబ్ అవార్డుల ఫంక్షన్‌లో చీమకుర్తి క్లబ్ తరఫున నిర్వహించిన మహాప్రస్థానం, మధ్యాహ్న భోజనం, ఉచిత మినరల్ వాటర్, బేసిక్ ఎడ్యుకేషన్ అండ్ లెర్నర్స్, పబ్లిక్ ఇమేజ్ అండ్ ఎన్విరాన్‌మెంట్ సర్వీస్ ప్రాజెక్ట్ వంటి పలు విభాగాల్లో సేవలకు గుర్తుగా ఈ అవార్డులు వచ్చినట్లు ప్రస్తుత క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు గొల్లపూడి కోటేశ్వరరావు చౌదరి, ఎం.తిరుపతిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ముప్పూరి చలమయ్య, పరాంకుశం శ్రీనివాస మూర్తి, గుండా వెంకటేశ్వర్లు, అంబటి వీరారెడ్డి, పోకూరి రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

సోషల్ వర్కర్ సభ్యులుగా దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు అర్బన్: బాలల సంక్షేమ సంస్కరణల సేవల శాఖ ఆధ్వర్యంలో జువైనల్ జస్టిస్ (పిల్లల రక్షణ, సంరక్షణ) చట్టం మేరకు రాష్ట్రంలో జువైనెల్ జస్టిస్ బోర్డులో సోషల్ వర్కర్ సభ్యులుగా సేవలందించేందుకు అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా శాఖ పర్యవేక్షణ అధికారి పి.బాల ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు నిర్దేశిత ప్రొఫార్మాలో తగిన ధ్రువపత్రాలతో ఈ నెల 13వ తేదీలోపు విజయవాడలోని శాఖ డైరెక్టర్ కార్యాలయంలో అందజేయాలని పేర్కొన్నారు. వివరాలకు http:/wdcw.ap.gov.in వెబ్‌సైట్‌లో తెలుసుకోవచ్చన్నారు. దరఖాస్తులను స్పీడ్ పోస్ట్, రిజిస్టర్ పోస్ట్ ద్వారా మాత్రమే పంపాలని తెలిపారు. జిల్లా సమాచారం కోసం 91000 45397, 99126 57999 నంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

శతాధిక వృద్ధురాలు మృతి



నారాయణమ్మ (ఫైల్ ఫొటో)

త్రిపురాంతకం: శతాధిక వృద్ధురాలు, ఓబుల్‌దాసు అఖిల ఆశ్రమం మఠాధిపతి నారాయణమ్మ మాతాజి (104) ఆదివారం మృతి చెందారు. త్రిపురాంతకం శ్రీపార్వతి సమేత త్రిపురాంతకేశ్వర స్వామి ఆలయం కొండదిగువన ఉన్న ఓబులుదాసు అఖిల ఆశ్రమానికి ఐదో తరం వంశపారంపర్య మఠాధిపతిగా నారాయణమ్మ ఉన్నారు. త్రిపురాంతకంలో నాసరయ్య మఠం ఉంది. ఆయన శిష్యుడిగా ఓబులుదాసు పేరుపొందారు. 200 సంవత్సరాలుగా ఈ ఆశ్రమం కొనసాగుతోంది. గురపరంపర శిష్యులు ఈ ఆశ్రమం ద్వారా కొనసాగుతున్నారు. నారాయణమ్మ స్వగ్రామం త్రిపురాంతకం మండలం రాజుపాలెం.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 30 మంది ఎంపిక

ఒంగోలు అర్బన్: అరబిందో ఫార్మసి కంపెనీ బీఎస్సీ విద్యార్థులకు ఆదివారం నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో శ్రీహర్షిణి డిగ్రీ కాలేజికి చెందిన 30 మంది ఎంపికైనట్లు సంస్థ హెచ్‌ఆర్ స్వరూప్ తెలిపారు. డిగ్రీ విద్యార్థులకు నెలకు రూ.15 వేలు, పీజీ విద్యార్థులకు రూ.17వేలు జీతం ఉంటుందని తెలిపారు. దీనిలో కాలేజి కరస్పాండెంట్ కవిత, సిబ్బంది పాల్గొన్నారు.

పులులకే విహారం..

పులులకు, ఎన్నో వన్యప్రాణులకు రక్షణ ఛత్రంగా ఉన్న నల్లమల అభయారణ్యంలో వాటి సంరక్షణ కోసం ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా పులుల మేటింగ్ సమయమైన జూలై, ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో అభయారణ్యంలో పర్యాటకుల రాకపోకలపై నిషేధించింది. దీంతో మూడు నెలల పాటు నల్లమలలోని పర్యాటక ప్రదేశాల సందర్శనకు విరామం ఇచ్చినట్టైంది. ఫలితంగా వన్యప్రాణుల స్వేచ్ఛా సంచారానికి అనువుగా ఉండనుంది.



తుమ్మలబయలు ఎకో టూరిజం కాటేజ్

- సందర్శకులకు విరామం
- మూడు నెలల పాటు మూత పడనున్న జంగిల్ సఫారీ, ఇష్టకామేశ్వరి ఆలయ దర్శనం
- పులులు స్వేచ్ఛగా సంచరించేందుకు అధికారుల ప్రత్యేక చర్యలు

పెద్దదోర్నాల: నల్లమల పేరు వింటేనే ప్రకృతి ప్రేమికుల మనస్సు పులకిస్తుంది. ఆహ్లాదకరమైన వాతావరణం, ఎత్తైన పర్వతాలు, లోతైన లోయలు, ఆకాశాన్ని అందేలా మహా వృక్షాలు కనువిందు చేస్తాయి. జలపాతాలు, సెలయేళ్లు, పచ్చని తీవాచి పరిచినట్లుండే అందమైన పచ్చికబయళ్లు, వర్షాకాలంలో నల్లమలను సందర్శించే పర్యాటకులకు కనువిందు చేసే సుందర దృశ్యాలివి. దీంతో పాటు స్వేచ్ఛాయుత వాతావరణంలో సంచరించే పెద్దపులులు, చిరుతలు, జింకలు, దుప్పులు మరెన్నో వన్యప్రాణులతో పాటు వింతలు, విశేషాలను తిలకించే అద్భుతమైన అవకాశానికి అధికారులు అనుమతులను నిలిపేశారు. దీంతో నేటి నుంచి నల్లమల అటవీప్రాంతంలోని వివిధ ప్రాంతాల్లో ఎకో టూరిజానికి సంబంధించిన జంగిల్ సఫారీలతో పాటు నల్లమలలోని ప్రసిద్ధిగాంచిన ఇష్టకామేశ్వరి అమ్మవారి ఆలయం మూత పడపడనున్నాయి.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పరిధిలోని ప్రకాశం, కర్నూలు, గుంటూరులతో పాటు, తెలంగాణ పరిధిలోని మహబూబ్‌నగర్, నల్గొండ, రంగారెడ్డి జిల్లాల్లో 9 వేల చదరపు కిలోమీటర్లలో నల్లమల అభయారణ్యం విస్తరించి ఉంది. ఈ ప్రాంతంలో వన్యప్రాణులను సంరక్షించేందుకు కేంద్ర ప్రభుత్వం 1983లో 3,568 చ.కి.మీ. పరిధిలో ఉన్న అటవీ ప్రాంతాన్ని అభయారణ్యంగా ప్రకటించింది. దోర్నాల నుంచి శ్రీశైలం శిఖరం వరకు రాజీవ్‌గాంధీ అభయారణ్యం, మార్కాపురం, గిద్దలూరు, ఆత్మకూరు, నంద్యాల డివిజన్లలో గుండ్లబ్రహ్మేశ్వర అభయారణ్యం ఉంది. పెద్దపులులతోపాటు, చిరుత, ఎలుగుబంటి, జింకలు, దుప్పులు, హైనా, నెమళ్లతోపాటు 70 రకాల క్షీరదాలు, సరీసృపాలు, ఎన్నోరకాల వృక్షాలు, ఔషధ మొక్కలు నల్లమల అభయారణ్యంలో ఉన్నాయి. వన్యప్రాణులకు వర్షాకాలం ఎంతో అనువైంది. ఈ కాలంలో అటవీప్రాంతం పచ్చగా మారటంతో నీటి వనరులు పుష్కలంగా ఏర్పడి వన్యప్రాణులు స్వేచ్ఛగా సంచరించే అవకాశం ఉంది.

భక్తులు, పర్యాటకుల నిషేధానికి కారణమిదే:
నల్లమల అభయారణ్యంలో పులుల సంతతి పెరిగేందుకు అటవీశాఖాధికారులు పటిష్ట చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా పులులకు ఆహారంగా ఉపయోగపడే జింకలు, దుప్పులు, అడవి పందుల పెరుగుదలకు అనుకూల ఆవాసం కల్పించడంతో పాటు స్వేచ్ఛాయుత వాతావరణంలో పెద్దపులులు సంచరించేందుకు అవసరమైన చర్యలు చేపట్టారు. ఈనెల ఒకటో తేదీ నుంచి సెప్టెంబర్ 30వ తేదీ వరకు పులుల కలయికకు అనుకూలమైన వాతావరణం. దీంతో దట్టమైన అభయారణ్యంలోని నిషిద్ధ ప్రాంతాల్లోకి పర్యాటకులు, ప్రజలు వెళ్లకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారు. సాధారణంగా ఈ సమయం పూర్తిగా వర్షాకాలం కురిసిన వర్షాలతో అడవి అంతా పచ్చగా దట్టమైన చెట్లు పొదలతో నిండి ఉంటుంది. ఈ కాలంలోనే పెద్దపులులు తాము జత కట్టిన పులితో ప్రశాంతంగా సంచరిస్తుంటాయి. ఈ నేపథ్యంలో వాటి స్వేచ్ఛకు భంగం కలిగించకుండా ఉండాలనే ఉద్దేశంతోనే దేశవ్యాప్తంగా ఉన్న 50 పులి సంరక్షణ కేంద్రాల్లోని ఎకోటూరిజాలు, జంగిల్ సఫారీలలో పర్యాటకులను సంచరించకుండా కేంద్ర ప్రభుత్వం నిషేధం విధించింది.

నిషేధంతో పులుల సంఖ్య మరింత పెరిగే అవకాశం:
దేశవ్యాప్తంగా 50 పులి సంరక్షణ కేంద్రాలుండగా వాటిలో నల్లమల నాగార్జునసాగర్–శ్రీశైలం టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ అతి పెద్ద అభయారణ్యంగా గుర్తింపు పొందింది. పులుల సంరక్షణలో నల్లమల ఓ రక్షణ ఛత్రం. ఆంధ్ర, తెలంగాణలలోని ఐదు జిల్లాల పరిధిలో విస్తరించిన నల్లమల రాష్ట్ర విభజనతో మన రాష్ట్రంలో ఐదు జిల్లాలే మిగిలాయి. ఆంధ్రాలో కర్నూలు, నంద్యాల, ప్రకాశం, గుంటూరు, పల్నాడు జిల్లాల్లో నల్లమల విస్తరించింది. నల్లమలలో పులుల సంరక్షణకు అటవీ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ఆహారం, అనుకూల ఆవాసాలు కల్పించటంలో సఫలీకృతులయ్యారు. నల్లమలలో ప్రధాన మార్గాల్లో బేస్‌క్యాప్‌ల ఏర్పాటు, స్ట్రైకింగ్ ఫోర్స్ రెస్క్యూ బృందాలు, డాగ్ స్క్వాడ్ వంటి బృందాలతో సంరక్షిస్తున్నారు. ప్రస్తుతం నల్లమలలో 73 వరకు పెద్ద పులులు ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. వర్షాకాలంలోని ఈ మూడు నెలలు పర్యాటకులకు నిషేధం విధించటం వల్ల పెద్దపులులు స్వేచ్ఛగా సంచరించి రానున్న రోజుల్లో పులుల సంతానోత్పత్తి మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు.

మూతపడనున్న ఇష్టకామేశ్వరి ఆలయం, జంగిల్ సఫారీలు

పులుల మేటింగ్ దృష్ట్యా నల్లమల అటవీ ప్రాంత పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉన్న ఎకో టూరిజాలు మూత పడనున్నాయి. దీంతో గిద్దలూరు సమీపంలో ఉన్న పచ్చర్ల, ఆత్మకూరు సమీపంలో ఉన్న బైర్లూటి, మండల పరిధిలోని తుమ్మల బయలు ఎకోటూరిజాలకు సంబంధించిన జంగిల్ సఫారీలతో పాటు, యర్రగొండపాలెం మండల పరిధిలో ఉన్న ఇష్టకామేశ్వరి ఆలయాలు సెప్టెంబర్ 30 తేదీ వరకు మూత పడి ఉంటాయి.



తుమ్మలబయలు వద్ద ఏర్పాటు చేసిన జంగిల్ సఫారీ

పులుల సంరక్షణ కోసమే తాత్కాలిక విరామం



పులుల సంరక్షణ కోసమే మూడు నెలల పాటు తాత్కాలిక నిషేధం విధిస్తున్నాం. వర్షాకాలంలో పులుల సంతానోత్పత్తి ప్రక్రియ జరుగుతుంది. దీని వల్ల వాటి ప్రశాంతతను కాపాడేందుకే ఈ నిషేధం విధిస్తున్నాం. జూలై ఒకటో తేదీ నుంచి సెప్టెంబర్ 30 తేదీ వరకు అభయారణ్యంలోకి పర్యాటకులు, సాధారణ పౌరులకు అనుమతులు ఉండవు.

– విశ్వేశ్వరరావు, రేంజి అధికారి, పెద్దదోర్నాల

ఉన్న ఊళ్లోనే ఉచితంగా..

- దరఖాస్తు చేసుకున్న గంటల వ్యవధిలోనే అవసరమైన సర్టిఫికెట్లు చేతికి
- ఎటువంటి రుసుం లేకుండా 11 రకాల సేవలు
- 'జగనన్న సురక్ష'తో అర్హులందరికీ సత్వరమే ప్రభుత్వ సేవలు
- దరఖాస్తుదారుల హర్షాతిరేకాలు



త్రోవగుంటలో జగనన్న సురక్ష కార్యక్రమంలో లబ్ధిదారుకు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న కలెక్టర్ దినేష్ కుమార్ (ఫైల్)

గతంలో ప్రభుత్వం నుంచి ఏదైనా సర్టిఫికెట్ అవసరమైతే నిర్ణీత రుసుము చెల్లించి సంబంధిత కార్యాలయాల చుట్టూ రోజుల తరబడి తిరగాల్సి వచ్చేది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక గ్రామ, వార్డు సచివాలయాలతో ప్రభుత్వ సేవలు ప్రజలకు చేరువయ్యాయి. తాజాగా అర్హులైన ఏ ఒక్కరూ సాంకేతిక కారణాలతో సంక్షేమ పథకాలకు దూరం కాకూడదన్న సంకల్పంతో జగనన్న సురక్ష కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. జిల్లాలో జూలై 1 నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమంలో తొలిరోజు శనివారం వేలాది మంది తమకు అవసరమైన సర్టిఫికెట్లను ఉచితంగా పొందారు. సాధారణంగా వారం నుంచి 30 రోజుల వ్యవధిలో జారీ చేయాల్సిన సర్టిఫికెట్లను కూడా రెండు మూడు గంటల వ్యవధిలోనే అందజేయడంతో లబ్ధిదారులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు.

– సాక్షి నెట్‌వర్క్

అర్జీ ఇచ్చిన వెంటనే ధ్రువీకరణ పత్రం



ఈమె పేరు దూదేకుల కాశమ్మ. మార్కాపురం పట్టణంలోని సుందరయ్య కాలనీలో నివాసం ఉంటోంది. ఈమెకు నివాస, పుట్టినతేదీ ధ్రువీకరణ పత్రం అవసరమైంది. గతంలో ఈ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నా కొన్ని కారణాల వలన ఆలస్యమైంది. ఈ నేపథ్యంలో శనివారం ప్రారంభమైన జగనన్న సురక్ష పథకంలో భాగంగా కార్యక్రమానికి హాజరై అర్జీ ఇచ్చింది. వెంటనే సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు విచారణ జరిపి ధ్రువీకరణ పత్రం అందచేయడంతో ఆమె సంతోషం వ్యక్తం చేసి ఆమె ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపింది.

శ్రమలేకుండా ఫ్యామిలీమెంబర్ సర్టిఫికెట్



ఈ ఫొటోలోని మహిళ పేరు జానకీ రంగలక్ష్మమ్మ. మార్కాపురం మండలం వేములకోట గ్రామం. అత్యవసరంగా ఈమెకు ఫ్యామిలీ మెంబరు సర్టిఫికెట్ అవసరమైంది. సాధారణంగా ఈ సర్టిఫికెట్‌కు దరఖాస్తు చేసుకుంటే వారం రోజుల సమయం పడుతుంది. జగనన్న సురక్ష కార్యక్రమానికి హాజరై అర్జీ ఇవ్వడంతో అధికారులందరూ వెంటనే విచారణ జరిపి అక్కడికక్కడే ఫ్యామిలీ మెంబర్స్ సర్టిఫికెట్‌ను అందజేశారు. దీంతో ఆమె ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపింది.

అత్యవసర సర్టిఫికెట్ వెంటనే ఇచ్చారు..



ఇతని పేరు షేక్ షబ్బీర్. మార్కాపురం పట్టణంలోని ఏకలవ్య కాలనీలో నివాసముంటున్నాడు. కుల ధ్రువీకరణ పత్రం అత్యవసరంగా మారింది. వార్డు వాలంటీర్ జగనన్న సురక్ష పథకాన్ని 1వతేదీన ప్రారంభిస్తున్నారని, ఆ రోజున దరఖాస్తు చేసుకుంటే వెంటనే ఇస్తారని చెప్పటంతో షబ్బీర్ కార్యక్రమానికి హాజరై అర్జీ ఇచ్చాడు. అధికారులు విచారణ జరిపి వెంటనే కులధ్రువీకరణ పత్రాన్ని అందచేశారు. గతంలో దరఖాస్తు చేసుకున్న వారం రోజులకు కానీ ఇచ్చేవారు కాదు. ఇప్పుడు వెంటనే ఇవ్వడంతో షబ్బీర్ సంతోషం వ్యక్తం చేశాడు.

పైసా ఖర్చు లేకుండా...నిమిషాల్లో సర్టిఫికెట్



ఈ అమ్మాయి పేరు గంజి కావ్య. ప్రకాశం జిల్లా వెలిగండ్ల మండలం గుడిపాటిపల్లి పంచాయతీ కట్టకిందపల్లి గ్రామం. కులం, ఆదాయ సర్టిఫికెట్ కోసం గుడిపాటిపల్లి సచివాలయంలో దరఖాస్తు చేసుకుంది. వలంటీర్ వీళ్ల ఇంటికి వెళ్లి అవసరమైన సర్టిఫికెట్ గురించి వివరాలు తీసుకొని యాప్‌లో నమోదు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం జూలై 1 నుంచి ప్రారంభించిన జగనన్న సురక్ష క్యాంపులో ఎంపీడీఓ టీ సుకుమార్ సర్టిఫికెట్‌ను అక్కడికక్కడే ఐదు పైసలు ఖర్చులేకుండా ఉచితంగా అందజేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల వద్దకే అధికారులను పంపించి సర్టిఫికెట్లను నిమిషాల్లో ఇప్పించడం పట్ల గంజి కావ్య సంతోషం వ్యక్తం చేసింది.

సులువుగా కోరిన సర్టిఫికెట్



ఈమె పేరు తంగిరాల చిన్నతల్లి. మండలంలోని నాతనాంపల్లి గ్రామంలో నివాసముంటోంది. ఈమెకు ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు అవసరం కాగా జగనన్న సురక్ష పథకంలో భాగంగా అధికారులందరూ తాడివారిపల్లి సచివాలయానికి వస్తున్నట్లు వాలంటీర్ ద్వారా తెలుసుకుని దరఖాస్తు చేసుకుంది. దీంతో వెంటనే అధికారులు సంబంధిత ఆధారాలు పరిశీలించి సర్పంచ్ జాన్‌రత్నం చేతులమీదుగా సర్టిఫికెట్ అందించారు. ఇంత సులభంగా సర్టిఫికెట్‌లు లభించడంతో ఆమె ఆనందానికి అవధులు లేవు. తమలాంటి వారికి జగనన్న సురక్ష పథకం ఎంతో మేలు చేస్తోందని సంతోషంగా తెలిపింది.

ఉచితంగా పొందటం ఈ ప్రభుత్వంలోనే సాధ్యమైంది.



ఇతని పేరు గుంటుపల్లి రమేష్. కొండపి మండలం చోడవరం గ్రామ నివాసి. ఇన్‌కం సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నాడు. వలంటీర్లు ఇంటికి వెళ్లి దరఖాస్తు చేసుకున్న సర్టిఫికెట్ గురించి అడిగి తెలుసుకుని అందుకు అవసరమైన సమాచారం అందించాడు. జగనన్న సురక్ష కార్యక్రమంలో గ్రామంలోనే సర్టిఫికెట్ ఉచితంగా అందుకున్నాడు. గతంలో సర్టిఫికేట్‌కి రూ.60 చెల్లించి మండల కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తే గాని అందని సర్టిఫికెట్ ఉచితంగా సొంత గ్రామంలోనే పొందటం ఈ ప్రభుత్వంలోనే సాధ్యమైంది.

అర్హతలున్న వారికి నూరు శాతం సంక్షేమ పథకాలు

- నాలుగేళ్లుగా విరామం లేకుండా సంక్షేమ ఫలాలు అందిస్తున్న సీఎం
- గడప గడపలో జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి
- రూ.40 లక్షల విలువ చేసే కమ్యూనిటీ హాలు, సచివాలయం కాంప్లెక్స్‌కు శంకుస్థాపన



సంక్షేమ పథకాల బ్రోచర్ అందిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి

చీమకుర్తి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హతలున్న వారికి నూరు శాతం సంక్షేమ పథకాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నారని ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు అన్నారు. మండలంలోని కూనంనేనివారిపాలెంలో ఆదివారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు గడప గడపకు తిరుగుతూ సంక్షేమ పథకాలు పొందిన లబ్ధిదారులతో మాట్లాడుతూ ఎన్నికల సమయంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చిన మేరకు అధికారంలోకి వచ్చిన గత నాలుగేళ్లలో అర్హతలున్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. అర్హతలుండి పథకాలు పొందలేని వారికి ఈనెల 1వ తేదీ నుంచి జగనన్న సురక్ష కార్యక్రమం పేరుతో అర్హత పొందటానికి ఎదురయ్యే సాంకేతిక సమస్యలను పరిష్కరించి వారికి కూడా సంక్షేమ పథకాలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్ బాబు, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి తెలిపారు. ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సంక్షేమ పథకాలు పొందిన వారితో మాట్లాడుతూ ఏఏ పథకాల ద్వారా ఎంతెంత డబ్బు వచ్చిందో వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో రూ.40 లక్షలతో బీసీ కమ్యూనిటీ హాలుకు భూమిపూజ, సచివాలయం కాంప్లెక్స్‌కు శిలా ఫలకాలన్ని ఆవిష్కరించారు. తొలుత గ్రామంలోకి ప్రవేశించినప్పుడు డప్పు వాయిద్యాలతో పూల వర్షం కురిపిస్తూ బూచేపల్లి వెంకాయమ్మ, టీజేఆర్ సుధాకర్‌బాబు, బూచేపల్లి శివప్రసాదరెడ్డికి ఘనంగా స్వాగతం పలికారు. శాలువాలు కప్పి పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మారెళ్ల బంగారుబాబు, ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యులు వేమా శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ మండల రూరల్ కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు యర్రగుంట్ల మోహన్, యర్రగుంట్ల వసంతరావు, ఏలూరి సురేష్, స్థానికులు, పలు గ్రామాల నుంచి సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, చీమకుర్తి నుంచి కౌన్సిలర్‌లు పాల్గొన్నారు.

ఎంఈఓ–1 కౌన్సెలింగ్‌లో జిల్లాకు 10 మంది

చీమకుర్తి: జోన్–3 పరిధిలో గుంటూరు ఆర్‌జేడీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన ఎంఈఓ–1 కౌన్సెలింగ్‌లో జిల్లాకు 10 మంది నూతన ఎంఈఓ–1లు వచ్చారు. జోన్–3లోని ప్రకాశం, నెల్లూరు, గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో పనిచేస్తున్న గ్రేడ్–2 ప్రభుత్వ హైస్కూళ్లకు సంబంధించిన 42 మంది హెడ్మాస్టర్లకు ఎంఈఓ–1 పోస్టుల్లో చేరేందుకు ఆర్జేడీ వీఎస్ సుబ్బారావు ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ నిర్వహించినట్లు ఆయన ఉత్తర్వులు విడుదల చేశారు. దాని ప్రకారం.. జిల్లాకు వచ్చిన 10 మంది ఎంఈఓ–1ల వివరాలు ఈ విధంగా ఉన్నాయి.

ఎంఈఓ–1 పేరు	పనిచేస్తున్న ప్రదేశం	ప్రస్తుతం పోస్టింగ్ మండలం
ఏ.చంద్రమౌళేశ్వర్	జెడ్పీహెచ్ఎస్, రామాయపట్నం ఉలవపాడు (మం)	సంతనూతలపాడు
జీ.తులసి కుమారి	జీహెచ్ఎస్, చీమకుర్తి	కొత్తపట్నం
టీ.రవి	జీహెచ్ఎస్, టంగుటూరు	నాగులుప్పలపాడు
ఎం.శ్రీనివాసులు	జీహెచ్ఎస్(జీ), పొదిలి	పొదిలి
ఎస్.వెంకటేశ్వర్లు	జీహెచ్ఎస్, గుంటూరు	చీమకుర్తి
జే.సుబ్బారావు	జీహెచ్ఎస్, చేబ్రోలు,గుంటూరు	ముండ్లమూరు
బీ.సామ్యూల్ జాన్	జీహెచ్ఎస్, యర్రగొండపాలెం	పుల్లలచెరువు
పీ.శ్రీనివాసులు	జీహెచ్ఎస్, పెద్దదోర్నాల	పెద్దారవీడు
ఈవీ రంగయ్య	జీహెచ్ఎస్, పొదిలి	మర్రిపూడి
డీవీ సుబ్బారావు	జీహెచ్ఎస్, అర్ధవీడు	కనిగిరి

బదిలీ ఉత్తర్వులు పొందిన ఎంఈఓ–1లు అందరూ 3వ తేదీ వారు కోరుకున్న మండలాల్లోని ఎంపీడీవోలకు, డిప్యూటీ డీఈవోల వద్ద రిపోర్ట్ చేయాలని ఆర్జేడీ ఆదేశించారు.

క్లుప్తంగా

నవోదయలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

తర్లుపాడు: మండలంలోని కలుజువ్వలపాడు జవహర్ నవోదయలో 2024–25 విద్యా సంవత్సరంలో 6వ తరగతిలో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ప్రసన్నకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలోగానీ, ప్రభుత్వంచే గుర్తింపు పొందిన పాఠశాలలోగానీ 3, 4 తరగతులు పూర్తిచేసి ఉండాలన్నారు. పశ్చిమ ప్రకాశంలోని 27 మండలాలలో ఏదో ఒకచోట 5వ తరగతి చదువుతూ ఉండాలన్నారు. 01.05.2012 నుంచి 31.07.2014 మధ్య జన్మించిన వారై ఉండాలన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ 10.08.2023 అని, పరీక్ష తేదీ 20.01.2024 అని వెల్లడించారు. పూర్తి వివరాలకు https://navodaya.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

సీనియర్ క్రికెట్ జట్టు ఎంపిక పూర్తి

ఒంగోలు అర్బన్: ప్రకాశం జిల్లా అడహక్ కమిటీ ఆధ్వర్యంలో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ మినీ లార్డ్స్ గ్రౌండ్‌లో నిర్వహించిన పురుషుల సీనియర్ క్రికెట్ జట్టు ఎంపిక పూర్తయినట్లు కమిటీ కన్వీనర్ ఎం వీరరాఘవరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికకు మొత్తం 45 మంది ఆటగాళ్లు హాజరయ్యారన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 4వ తేదీ మూలపాడు ఏసీఏ గంగరాజు స్టేడియంలో జరిగే సీనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ మ్యాచ్‌లో పాల్గొంటారని పేర్కొన్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

యర్రగొండపాలెం: కుటుంబ కలహాలతో మనస్తాపం చెందిన వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. మండలంలోని జి.కొత్తపల్లెకు చెందిన ఆముదాల వెంకటరెడ్డి(55) గత నెల 26వ తేదీన ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి ఆయన బంధువులు వెతుకున్నా ఆచూకీ తెలియలేదు. ఆదివారం స్థానిక చెరువు కట్టవద్ద మృతదేహం ఉండటాన్ని చూసిన గొర్రెల కాపరులు పోలీసులకు సమాచారం అందించారు. ఆ మృతదేహం వెంకటరెడ్డిదని, పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడని పోలీసులు తెలిపారు. కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జి.కోటయ్య తెలిపారు.

ఆదినారాయణకు పుట్టంరాజు పురస్కారం

అద్దంకి: నాగభైరవ ఆదినారాయణకు పుట్టంరాజు బుల్లెయ్య రామలక్ష్మమ్మ చారిటబుల్ ట్రస్ట్ 2023 పురస్కారాన్ని ట్రస్ట్ అధ్యక్షుడు ఆదివారం అందజేశారు. కార్యక్రమం బాపట్ల రచయితల సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని రామ సుశీల నిలయంలో నిర్వహించారు. పురస్కారం కింద ఆదినారాయణకు రూ. 10 వేలు నగదు, పట్టుబట్టలు, జ్ఞాపికను పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి అందజేశారు. బాపట్ల రచయితల సంఘం, సృజన, సాహితీ మిత్రమండలి, పురస్కార గ్రహీతను అభినందించారు. కవి సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు.

అదిగో నవలోకం

నడిపించే నాయకుడు పేదల పక్షపాతి అయితే ఎలా ఉంటుందో నేటి వైఎస్సార్ సీపీ రథ సారథి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చూపిస్తున్నారు. ఎన్నో రకాల పథకాల రూపకల్పనతో వారి జీవితాల్లో వెలుగులు నింపుతున్నారు. ప్రస్తుతం పశ్చిమ ప్రకాశంలో నిర్మించిన జగనన్న లే అవుట్లలో విద్యుత్ కాంతులు విరజిమ్ముతున్నాయి.


ఇడుపూరు లేఅవుట్‌లో విద్యుత్ కాంతులు

సబ్‌డివిజన్ పేరు	లేఅవుట్లు	విద్యుత్ లైన్లు వేసిన లేఅవుట్లు
మార్కాపురం	66	43
కంభం	57	32
గిద్దలూరు	69	44
వై.పాలెం	28	22

- జగనన్న కాలనీల్లో విద్యుత్ వెలుగులు
- పశ్చిమ ప్రకాశంలో 220 లేఅవుట్లు
- ఇప్పటికే 141 లేఅవుట్లలో విద్యుద్దీకరణ పూర్తి
- 4875 విద్యుత్ స్తంభాలు ఏర్పాటు

మార్కాపురం:

అర్హులైన పేదలందరికీ ఇళ్లు కల్పించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఏర్పాటు చేస్తున్న జగనన్న కాలనీలు మెరిసిపోతున్నాయి. ఊరిబయట ఇళ్ల స్థలాలు ఇస్తే విమర్శించిన వారు నేడు ఆ ప్రాంతాలు కొత్త ఊర్లలా మారడంతో మౌన ముద్రలోకి జారుకున్నారు. రాత్రిపూట విద్యుత్ కాంతుల ధగధగలతో కాలనీలన్నీ మెరుస్తున్నాయి. వ్యక్తిగతంగా గృహ నిర్మాణ శాఖ ద్వారా మంజూరైన లబ్ధిదారులు కూడా ఇల్లు కట్టుకుంటే ఉచితంగా విద్యుత్ కనెక్షన్లు ఇస్తున్నారు. పశ్చిమ ప్రకాశంలోని మార్కాపురం, యర్రగొండపాలెం, గిద్దలూరు నియోజకవర్గాల్లో మొత్తం 220 లేఅవుట్లున్నాయి. కాగా విద్యుత్ శాఖ పరంగా మార్కాపురం, కంభం, గిద్దలూరు, యర్రగొండపాలెం సబ్‌డివిజన్లున్నాయి. ఆయా కాలనీల్లో మొత్తం 4877 విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారు. మార్కాపురం మండలం ఇడుపూరు వద్ద ఇండోర్ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మిస్తుండటం విశేషం. జగనన్న కాలనీల్లో మొత్తం 75 కి.మీ పొడవునా విద్యుత్ లైన్లు ఏర్పాటు చేశారు. 22631 ప్లాట్లకు విద్యుత్ సౌకర్యం కల్పించాల్సి ఉండగా సుమారు 1100 ఇళ్లకు ఇప్పటికే విద్యుత్ కనెక్షన్లు ఇచ్చారు. 141 లేఅవుట్లలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి కనెక్షన్లు ఇచ్చారు. సొంత స్థలాల్లో ఇళ్లు కట్టుకున్న 2177 మంది లబ్ధిదారులకు కూడా విద్యుత్ సౌకర్యం కల్పించారు. వివిధ కాలనీల్లో సబ్‌స్టేషన్ల నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయి.


ఇడుపూరు వద్ద నిర్మాణంలో ఉన్న ఇండోర్ విద్యుత్ సబ్‌స్టేషన్

త్వరలో అన్ని కాలనీలకు విద్యుత్



జగనన్న కాలనీల్లో యుద్ధ ప్రాతిపదికన విద్యుత్ సౌకర్యం కలిస్తున్నాం. మా సిబ్బంది గృహ నిర్మాణ శాఖ ద్వారా మంజూరైన ఇళ్లకు కూడా వెంటనే కనెక్షన్లు ఇస్తున్నారు.
– సియా నాయక్, డీఈ, మార్కాపురం

ఓటీపీ అడిగితే చెప్పవద్దు

- ప్రభుత్వ పథకాల పేర్లతో వచ్చే ఫోన్లతో జాగ్రత్త
- ఎస్పీ మలికాగర్గ్


ఎస్పీ మలికాగర్గ్

ఒంగోలు టౌన్: మీకు అమ్మ ఒడి వచ్చిందని.. రైతు భరోసా డబ్బులు పడ్డాయని.. ఇంకా విద్యాదీవెన, వసతి దీవెన, ఆరోగ్య శ్రీ వంటి పథకాల పేర్లు చెప్పి కొందరు వ్యక్తులు ఫోన్లు చేసి ఓటీపీ అడిగితే చెప్పవద్దని ఎస్పీ మలికాగర్గ్ సూచించారు. ప్రభుత్వ పథకాల పేర్లతో ఎవరైనా అపరిచిత వ్యక్తులు చేసే ఫోన్లపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. ఆ మేరకు ఆదివారం ప్రకటన విడుదల చేశారు. కొందరు సైబర్ నేరగాళ్లు కొత్త కొత్త మార్గాల్లో మోసం చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ పథకాల పేర్లతో ప్రజల బ్యాంకు ఖాతాల నుంచి డబ్బు మాయం చేస్తున్నారని తెలిపారు. తాము అధికారులం మాట్లాడుతున్నామంటూ ఫోన్ చేసి.. మీకు డబ్బులు పడ్డాయని, మీ బ్యాంకు ఖాతా నంబర్, ఓటీపీ చెబితే మీ ఖాతాలో డబ్బులు పడతాయని నమ్మిస్తున్నారని చెప్పారు. ఒకవేళ ఎవరైనా ఓటీపీ నంబర్ చెబితే క్షణాల్లో వారి బ్యాంకు ఖాతా నుంచి డబ్బు మాయం చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ పథకాల గురించి అధికారులు ఎప్పుడూ ఫోన్లు చేయరన్నారు. బ్యాంకు ఖాతా వివరాలు, పాస్‌వర్డ్‌లు, ఓటీపీలను గోప్యంగా ఉంచుకోవాలని సూచించారు. ఎవరైనా ఇలాంటి మోసాలకు గురైతే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. సైబర్ హెల్ప్ లైన్ నంబర్ 1930కు కాల్ చేయాలని, నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని ప్రజలకు ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

పీడీఎఫ్ బియ్యం పట్టివేత

- రెండు రైస్ మిల్లులు, ఒక వాహనం సీజ్

ఒంగోలు అర్బన్: పౌర సరఫరాల ద్వారా పేదలకు పంపిణీ చేసే బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వారిపై కొరడా ఝుళిపించారు. రెండు రైస్ మిల్లులతో పాటు ఒక వాహనాన్ని సీజ్ చేశారు. కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశాలతో పౌర సరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఒంగోలు ఈడీటీ ఆర్‌వీఎస్ కృష్ణమోహన్, సింగరాయకొండ ఈడీటీ సీహెచ్ కృష్ణమోహన్‌లు 1వ తేదీ రాత్రి నుంచి పలు ప్రాంతాల్లో దాడులు చేశారు. ఒంగోలు పీర్లమాన్యంలోని చంద్రరైస్ ట్రేడర్స్‌లో 89 క్వింటాళ్ల పీడీఎఫ్ బియ్యం, మద్దిపాడు మండలం వెల్లంపల్లిలోని లక్ష్మీదత్త రైస్ మిల్లులో 26 కేజీల 221 బస్తాల బియ్యాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు చేసి పట్టుకున్నారు. సీజ్ చేసిన బియ్యాన్ని ప్రభుత్వ గోదాములకు తరలించారు. మిల్లులను సీజ్ చేశారు. పక్కా సమాచారంతో నాగులుప్పలపాడు మండలం కొత్తకోట వద్ద ఏపీ 27 టీవై 2344 వాహనంలో అక్రమంగా తరలిస్తున్న 50 కేజీల బరువైన 85 బస్తాలను పట్టుకుని వాహనాన్ని సీజ్ చేశారు.


లారీలో అక్రమంగా తరలిస్తున్న పీడీఎఫ్ బియ్యం పట్టుకున్న అధికారులు

గుప్తనిధుల కోసం ఆలయంలో తవ్వకాలు

- ఏడుగురిని పట్టుకుని పోలీసులకు అప్పగించిన గ్రామస్తులు

బేస్తవారిపేట: గుప్తనిధుల కోసం పురాతన ఆలయంలో తవ్వకాలు చేస్తుండగా, ఏడుగురిని గ్రామస్తులు పట్టుకుని పోలీసులకు అప్పగించిన సంఘటన బేస్తవారిపేట మండలంలోని పిటికాయగుళ్లలో చోటుచేసుకుంది. గ్రామంలోని పురాతన దేవాలయమైన పిటికేశ్వరస్వామి ఆలయంలో గుప్తనిధుల కోసం శనివారం అర్ధరాత్రి కొందరు తవ్వకాలు చేపట్టారు. బాపట్ల జిల్లా సంతమాగులూరు మండలం వేల్పూరుకు చెందిన షేక్ జానీబాషా గతంలో బేస్తవారిపేట పరిసర ప్రాంతాల్లో తాపీమేస్త్రిగా పనులు చేశాడు. ఆ సమయంలో పురాతన ఆలయం గురించి తెలుసుకున్నాడు. గుప్తనిధులు ఉంటాయనే ఆలోచనతో తెలంగాణ రాష్ట్రం వరంగల్ ప్రాంతానికి చెందిన రామోజీకుమారస్వామి, బిక్కే నాయుడు, మంతు హరిశంకర్, అద్దంకికి చెందిన బనావత్ సతీష్‌నాయక్, కొత్తపట్నంకు చెందిన గాలి నాగిరెడ్డి, మార్కాపురంకు చెందిన ఏడుకొండలును మాట్లాడుకున్నాడు. ఏడుగురూ కలిసి ఓ వాహనంలో రాత్రి 11 గంటల నుంచి రెక్కీ నిర్వహించారు. ఇద్దరు వ్యక్తులు పిటికాయగుళ్ల బస్టాండ్ పరిసరాల్లో వాహనాన్ని నిలుపుకున్నారు. ఐదుగురు మెటల్ డిటెక్టర్‌తో టార్చిలైట్లు వేసుకుని గుప్తనిధుల కోసం ఆలయం పరిసరాల్లో వెతుకుతూ తవ్వకాలు చేపట్టారు. పిటికాయగుళ్ల గ్రామంలో డాబాలపై పడుకున్న కొందరు ఆలయ పరిసరాల్లో టార్చిలైట్లు వెలుగుతుండటాన్ని గమనించారు. అనుమానం వచ్చి పోలీసులకు సమాచారం ఇచ్చారు. గ్రామస్తులు పసిగట్టడాన్ని గ్రహించిన బస్టాండ్‌లోని వ్యక్తులు ఆలయం వద్ద తవ్వకాలు జరుపుతున్న వారికి సమాచారం అందించారు. వాహనంలో ఏడుగురూ పారిపోయేందుకు ప్రయత్నం చేస్తుండగా గ్రామస్తులు పట్టుకున్నారు. అదే సమయంలో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు నిందితులను పట్టుకున్నారు. వారి వాహనంతో పాటు తవ్వకాలు చేపట్టేందుకు తీసుకొచ్చిన పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై మాధవరావు తెలిపారు.


పట్టుబడిన నిందితులు

కంభంలో కారు బీభత్సం

- బంకులోకి దూసుకెళ్లడంతో ఇద్దరికి గాయాలు

కంభం: పట్టణంలోని కందులాపురం కూడలిలో ఆదివారం ఓ కారు బీభత్సం సృష్టించింది. కంభం నుంచి అర్ధవీడు వెళ్తున్న కారు డ్రైవర్‌కు ఫిట్స్ రావడంతో అదుపుతప్పి ఓ బంకులోకి దూసుకెళ్లింది. దీంతో ఆ బంకులో బజ్జీలు వేస్తుండగా, వేడిగా ఉన్న నూనె పడి బంకు యజమాని పిచ్చయ్యతో పాటు మరొకరికి గాయాలయ్యాయి. స్థానికులు సంఘటన స్థలానికి చేరుకుని కారు అద్దాలు పగలగొట్టి డ్రైవర్‌ను బయటకు తీశారు. క్షతగాత్రులను కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కారులో నలుగురు ప్రయాణికులు ఉండగా, వారంతా రాచర్ల నుంచి అర్ధవీడు మండలంలోని కాటంరాజు వద్దకు వెళ్తున్నారు.


బంకులోకి దూసుకెళ్లిన కారు

సంక్షేమ పథకాలతో అందరికీ ఆనందం


గడపగడపలో పథకాల గురించి వివరిస్తున్న మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

- మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి
- రాయవరంలో ఉత్సాహంగా గడపగడపకు మన ప్రభుత్వం
- అడుగడుగునా ఘనస్వాగతం

మార్కాపురం: అవ్వా బాగున్నావా.. తాతా పింఛన్ వస్తుందా.. అక్కా ఆసరా పథకం వచ్చిందా..? అంటూ మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ ముందుకు సాగారు. ఆదివారం ఉదయం మార్కాపురం మండలంలోని రాయవరం సచివాలయం పరిధిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని ప్రజలు అడుగడుగునా ఎమ్మెల్యేపై పూలు చల్లుతూ ఘనంగా స్వాగతం పలికారు. ఎంతో ఉత్సాహంగా సాగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కేపీ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలందరూ ఆనందంగా ఉన్నారన్నారు. అర్హులైన అందరికీ నవరత్నాల పథకాలు అందుతున్నాయన్నారు. అర్హత ఉండి పథకాలు రాని వారు ఉంటే వలంటీర్లు, సచివాలయ సిబ్బందిని సంప్రదిస్తే సమస్యలను పరిష్కరిస్తారన్నారు. జగనన్న సురక్ష పథకాన్ని ఉపయోగించుకుని అవసరమైన సర్టిఫికెట్లు పొందాలని సూచించారు. నెల రోజుల పాటు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలతో ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగకుండా అక్కడికక్కడే నిర్ణీత గడువులో అన్ని సేవలు అందుతాయన్నారు. సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందని, ఆ ఘనత సీఎం జగనన్నకే దక్కుతుందని అన్నారు. ఆర్థికంగా ప్రతిఒక్కరూ బాగుండాలనే లక్ష్యంతో ఇచ్చిన మాట ప్రకారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ రైతు భరోసా, ఆసరా, జగనన్న విద్యాదీవెన, అమ్మ ఒడి తదితర పథకాలు అమలు చేస్తున్నారన్నారు. వివిధ ప్రాంతాల్లో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టామని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ అరుణా చెంచిరెడ్డి, వైస్ ఎంపీపీ దేవండ్ల లక్ష్మమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు పెద్దమల్లయ్య, చిన్నమల్లయ్య, అడివయ్య, శేషిరెడ్డి, వెలుగు ఏపీఎం రమేష్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వీఆర్‌ఏ మృతి

యర్రగొండపాలెం: స్థానిక మార్కాపురం రోడ్డులోని అనకుంట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వీఆర్‌ఏ మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే..మండలంలోని నరసాయపాలెంకు చెందిన వీఆర్‌ఏ ఇండ్ల శ్రీను(36) పనుల నిమిత్తం మోటారు బైక్‌పై యర్రగొండపాలెం వచ్చి తిరిగి స్వగ్రామం వెళ్తున్న సమయంలో అనకుంట మలుపు వద్ద బొప్పాయి లోడుతో ఎదురుగా వచ్చిన బొలెరో వాహనం ఢీకొంది. ఈ సంఘటనలో శ్రీను అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై జి.కోటయ్య పేర్కొన్నారు.


వీఆర్‌ఏ శ్రీను మృతదేహం

కాలువలోకి దూసుకెళ్లిన కారు

- తప్పిన పెను ప్రమాదం

చేజర్ల (సోమశిల): ఓ కారు సోమశిల ఉత్తర కాలువలోకి దూసుకెళ్లిన ఘటన ఆదివారం జరిగింది. స్థానిక పోలీసుల సమాచారం మేరకు.. ప్రకాశం జిల్లా కనిగిరికి చెందిన శ్రీనివాస్, సూర్య, మాధవ్, అలేఖ్య, భాగ్యలక్ష్మి తిరుమల దైవదర్శనానికి కారులో బయలుదేరారు. అనంతసాగరం మండలం పాతాళపల్లి వద్దకు వచ్చే సరికి కారు అదుపు తప్పి సోమశిల ఉత్తర కాలువలోకి దూసుకెళ్లింది. అయితే ఆ సమయంలో కారులో ఉన్న ఐదుగురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఈ ప్రమాదంలో కారు బాగా దెబ్బతింది. క్షతగాత్రులను 108లో ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. స్థానికుల సహాయంతో సోమశిల ప్రాజెక్ట్ పోలీసులు కారును వెలికి తీశారు.


కాలువలో పడిన కారు

పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన వారితో
మర్యాదగా మెలగాలి

- ఒంగోలు డీఎస్పీ నారాయణస్వామిరెడ్డి
- కొత్తపట్నం పోలీస్‌స్టేషన్ ఆకస్మిక తనిఖీ

కొత్తపట్నం: పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన బాధితులతో మర్యాదగా, ఆప్యాయంగా మెలగాలని ఒంగోలు డీఎస్పీ వి.నారాయణస్వామిరెడ్డి సిబ్బందిని ఆదేశించారు. సాధారణ తనిఖీల్లో భాగంగా ఆదివారం కొత్తపట్నం పోలీస్‌స్టేషన్‌ను ఆయన సందర్శించారు. రికార్డులు తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. స్టేషన్ ఆవరణను పరిశీలించారు. మహిళా పోలీస్‌స్టేషన్ సిబ్బందికి సలహాలు, సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో డీఎస్పీ మాట్లాడుతూ స్టేషన్‌కు వచ్చిన బాధితులతో మంచిగా మాట్లాడి న్యాయం చేస్తేనే పోలీస్‌స్టేషన్, పోలీసుశాఖ జిల్లా అధికారులకు పేరు వస్తుందన్నారు. నిష్పక్షపాతంగా వ్యవహరించి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. కేసులు పెండింగ్ లేకుండా వెంటనే పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు. దొంగతనం కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని, మోటార్లలో వైర్లు దొంగతనం చేసే వారు మోటార్లు ఊడదీసేటప్పుడు ఆ ప్రదేశంలోనే సుమారు రెండు గంటలసేపు ఉంటారని, వారి ఫోన్ కాల్స్, లొకేషన్‌ను బట్టి దొంగలను వెంటనే గుర్తించవచ్చని వివరించారు. ఫోన్ కాల్ డేటా తీసి వెంటనే కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. తీర ప్రాంతంలో అనుమానితులను గుర్తించి వెంటనే జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తే ఎక్కువ కేసులు నమోదు కావని డీఎస్పీ వివరించారు. ఒంగోలు టూ టౌన్ సీఐ జగదీశ్‌రావు, ఎస్సై బి.సాంబశివరావు, రైటర్ రంగారావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు



కొత్తపట్నం పోలీస్ స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న ఒంగోలు డీఎస్పీ నారాయణస్వామిరెడ్డి